www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 9 జనవరి 2025 5 తూర్పుగోదావరి



పంచాయతీల్లో డిజిటల్ వసూళ్లు చేపట్టాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు ఇంటి పన్నులు, నీటి పన్నులను, ఇతర వసూళ్లను డిజిటల్ విధానంలో మాత్రమే వసూలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలూ ఇంటి పన్నులు, నీటి పన్నులను డిజిటల్ మోడ్‌లో వసూలు చేశాయని, ఇకపై ప్రతి ఒక్క పన్ను, పన్నేతర వసూళ్ల పరంగా అన్ని గ్రామ పంచాయతీలకు డిజిటల్ విధానంలో కలెక్షన్ చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటికే డిజిటల్ నగదు చెల్లింపు వసూళ్ళ పరంగా తగినంత అవగాహన ఉందని పేర్కొన్నారు. అందువల్ల, తూర్పుగోదావరి జిల్లాలో గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో మరింత సమర్థవంతంగా పనితీరు చూపాల్సి ఉంటుందన్నారు. ఇకపై అన్ని రకాల లావాదేవీలను పారదర్శకతతో వ్యవహరించి నిర్వహించాలన్నారు.

ప్రాథమిక పాఠశాల వ్యవస్థను పునరుద్ధరించాలి

- యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ తీర్మానం
- రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- అధ్యక్షునిగా ఎం.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్
- విజయవంతంగా ముగిసిన మహాసభ

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, కాకినాడ

ప్రాథమిక పాఠశాల వ్యవస్థ(1 నుంచి 5 తరగతులు)ను పునరుద్ధరించాలని యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. కాకినాడలో జరుగుతున్న స్వర్ణోత్సవ మహాసభ బుధవారంతో ముగిసింది. చివరి రోజు రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే విద్యా గొడుగు కిందకు తెచ్చేందుకు యుటిఎఫ్ కృషి చేస్తుందన్నారు. అవసరమైతే ఎల్‌కెజి, యుకెజిలను కూడా వీటిలోనే నిర్వహించాలన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం మాతృభాషలో జరగాలన్నారు. హైస్కూల్లో రెండు మీడియంలలో బోధన కొనసాగించాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గిరిధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సాంకేతిక స్పృహ పెంపొందించాలన్నారు. అనంతరం రాష్ట్రంలో 26 జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతో జిల్లాల వారీగా విశ్లేషణ జరిపి చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమ నిర్వహణా బాధ్యతలు చేపట్టిన కాకినాడ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నగేష్, టి.చక్రవర్తి మాట్లాడుతూ ఈ మహాసభకు సహకరించిన ప్రజాసంఘాలు, వివిధ శాఖల అధికారులకు, ప్రజా ప్రతినిధులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ప్రసాదరావు, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిల కోసం యుటిఎఫ్ కార్యాచరణ తీసుకుందని చెప్పారు.

మహాసభలో మాట్లాడుతున్న కాకినాడ డిఇఒ రమేష్

చివరి రోజు మహాసభలో కాకినాడ ఎంపి ఉదయ్‌శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల బకాయిల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ప్రభుత్వం త్వరలో వీటిని చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం జల జీవన్ పథకం నిధులు రూ.21 వేల కోట్లను సక్రమంగా ఖర్చుపెట్టలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి శరవేగంగా జరుగుతోందన్నారు.

కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ మాట్లాడుతూ యుటిఎఫ్ నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయ సంఘమన్నారు. స్వర్ణోత్సవాలు జరుగుతున్న కాకినాడ పిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వివి.తిరుపాణ్యం మాట్లాడుతూ తమ కళాశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

యుటిఎఫ్ రాష్ట్ర మహాసభ చివరి రోజు రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక జరిగింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షులుగా ఎన్.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కెఎస్ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.సురేష్ కుమార్, ఎఎన్.కుసుమకుమారి, కోశాధికారిగా ఆర్.మోహన్‌రావు, 15 మంది రాష్ట్ర కార్యదర్శులతో నూతన కమిటీ ఏర్పడింది. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా టివిఎస్ఎన్.మల్లేశ్వరరావు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులుగా కె.సురేష్ కుమార్, ప్రచురణాల కమిటీ చైర్మన్‌గా ఎం.హనుమంతరావు, కుటుంబ సంక్షేమ పథకం అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, అధ్యయన కమిటీ అధ్యక్షులుగా పి.బాబు రెడ్డి ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి నూతన కార్యవర్గం కృషి చేస్తుందని పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవ మహాసభను ఘనంగా నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యకర్తలను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో సభ్యత్వం జనరల్ ఫండ్ అధికంగా వసూలు చేసిన శాఖలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సభలో పలు కొత్త పుస్తకాలను ఆవిష్కరించారు. నాలుగు రోజులూ అనేక సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించిన ఉపాధ్యాయ బృందాలకు బహుమతులు అందించారు.

తీర్మానాలు ఇవీ...

యుటిఎఫ్ 17వ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక స్వర్ణోత్సవ మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. ప్రధానంగా సిపిఎస్ రద్దు, 117 జిఒ రద్దు, ప్రాథమిక పాఠశాల వ్యవస్థ 1-5 తరగతులు పునరుద్ధరణ, హై స్కూల్లో తెలుగు, ఇంగ్లీష్ మీడియం కొనసాగించాలని, ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులకు ప్రమోషనులు కల్పించాలని, 12వ నూతన వేతన సవరణ సంఘం నియమించాలని, ఐఆర్ వెంటనే చెల్లించాలని తీర్మానం చేశారు. అలాగే ఖాళీ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, యాప్స్ భారం తగ్గించాలని, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ సాధన, విద్యా విధానం రద్దు చేయాలని, మున్సిపల్ టీచర్ల, ట్రైబల్ జూనియర్ లెక్చరర్స్ ప్రోమోషన్లు ఇవ్వాలని, ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని తీర్మానాలు చేశారు. వీటిని సభ ఏకగ్రీవంగా ఆమోదించింది

అంతిమ యాత్రలో పాల్గొన్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

రాఘవమ్మకు కన్నీటి వీడ్కోలు

తొత్తరమూడిలో అంత్యక్రియలు పూర్తి

సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు హాజరు

నివాళులర్పించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - అమలాపురం, అయినవిల్లి

కుడుపూడి రాఘవమ్మకు ప్రజలు, సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో బాధ పడుతూ ఆమె మంగళవారం స్వగ్రామమైన అయినవిల్లి మండలం తొత్తరమూడిలో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియులు బుధవారం నిర్వహించారు. పలువురు సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు. ఐద్వా సీనియర్ నాయకులు టి.సావిత్రి, సిపిఎం నాయకులు జి.బేబిరాణి తదితరులు ఆమె పాడెను మోస్తూ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సిపిఎం జెండాను కప్పుతున్న ఎంఎల్‌సి ఐవి

పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు రాఘవమ్మ భౌతికకాయంపై సిపిఎం జెండాను ఉంచి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవమ్మ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఎర్ర జెండా పట్టుకుని ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై పోరాటం చేశారాన్నరు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కమ్యూనిస్టులు ప్రజా సంఘాల నాయకులతో కలిసి అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. భర్త మరణం తరువాత కూడా ఉద్యమాల్లోనే కొనసాగారన్నారు. ఆమెను అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడటమే ఆమెకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. అనంతరం సిపిఎం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.కృష్ణవేణి సిపిఎం కాకినాడ జిల్లా నాయకులు దువ్వా శేషాబాబ్జి, జి.బేబిరాణి, కెఎస్.శ్రీనివాస్, ఎం.రాజ్ శేఖర్ మాట్లాడుతూ కుడిపూడి రాఘవమ్మ నాటి నుంచి నేటి వరకు ప్రజా సమస్యలపై విశ్రాంతిలేని పోరాటం చేశారన్నారు. అనేక సమస్యలు ఎదుర్కొంటూ పార్టీ విలువలకి కట్టుబడి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జి.దుర్గాప్రసాద్, టి.నాగవరలక్ష్మి, వ్యవసాయకార్మిక సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి సింహాచలం, పలివెల వీరబాబు, ఎం.వెంకటరమణ, ఎం.రామకష్ణ, పి.రామకృష్ణ, సిహెచ్.పద్మ, పీతల రామచంద్రరావు, వెంకట్రావు, కాంత్రికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో యూరియా కొరతపై వదంతులు వాస్తవం కాదని మండల వ్యవసాయ అధికారి పత్రికా ప్రకటనలో తెలిపారు. మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, పొగాకు, అరటి, కూరగాయలు ఇతర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ రబీ సీజన్‌లో మార్చి నెలాఖరు వరకూ పంటకు సుమారు 4150 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ఇప్పటికే 2800 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసినట్టు తెలిపారు. వాటిలో 2,650 మెట్రిక్ టన్నులు రైతులు తీసుకెళ్ళగా ఇంకా 150 మెట్రిక్యులేషన్ టన్నుల యూరియా నిల్వ ఉందని తెలిపారు. యూరియా కొరత లేకుండా ప్రణాళిక సిద్ధం చెందినట్లు తెలిపారు. మరో మూడు నాలుగు రోజుల్లో 300 నుంచి 400 మెట్రిక్ టన్నులు యూరియా మండలానికి వస్తుందని అన్నారు.

భూముల అనుమతులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి విషయంలో ఆయా శాఖల ఉన్నతాధికారుల ద్వారా భూముల పరాయీకరణ (అలీనేషన్)కు సంబంధించి అనుమతుల మంజూరు కోసం ప్రత్యేక దష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల పరాయీకరణ భూముల, పివిజిటి గ్రూప్స్, భూపతిపాలెం, పిఎం జన్మన్ గృహాల అంశాలపై సమన్వయ శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి కలెక్టర్, బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంక్షేమ, ఎపి ట్రాన్స్‌కో, ఎయిర్‌పోర్టు, టూరిజం, క్రీడలు , జాతీయ రహదారులు, మార్కెటింగ్, పశు సంవర్ధక, విద్య, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన 54 భూ సంబంధ అలీనేషన్ ప్రక్రియపై తగిన అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో బలహీన గిరిజన సమూహాల 99 కుటుంబాలకు చెందిన 399 మందికి తగిన గుర్తింపు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర ప్రభుత్వ శాఖల అధ్వర్యంలో వారికి అందాల్సిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఆధార్ సంఖ్య, రేషన్ కార్డు, గృహాలు లేని వారికి ఇళ్ళు, స్థలం ఉన్నవారికి ఇళ్ల నిర్మాణం కోసం గృహ నిర్మాణాల మంజూరు, స్వయం జీవనోపాధి కల్పించడం, వారి పిల్లలు విద్య అభ్యసించేలా ఆయా కుటుంబాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒలు ఆర్.కృష్ణ నాయక్, రాణి సుస్మిత, జిల్లా హౌసింగ్ అధికారి డి.భాస్కర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కెఎన్.జ్యోతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్ఎఫ్ఐ రాజమండ్రి నగర కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎస్ఎఫ్ఐ నగర నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. నగర మహాసభ ఎస్‌కెవిటి కళాశాలలో బుధవారం ఎం.జోసెఫ్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా పాల్గొని మాట్లాడారు. నగరంలో విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ కృషి చేసి విజయం సాధించిందని తెలిపారు. ముఖ్యంగా కందుకూరి విద్యాసంస్థలు ప్రభుత్వంలో విలీనం చేయడం, జూనియర్ కళాశాల కో ఎడ్యుకేషన్‌గా నడపాలని, రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు ఇవ్వడం, మధ్యాహ్న భోజనం ప్రారంభించడం ఇవి ఎస్ఎఫ్ఐ ఉద్యమాలతోనే సాధించుకున్నామని తెలిపారు. నూతన కమిటీ 17 మందితో ఎన్నికయ్యింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.జోసెఫ్, కె.జ్యోతిర్మయి నూతన కార్యదర్శివర్గంగా కనక, దుర్గ, సాహితి, సురేష్, చైతన్య, కమిటీ సభ్యులుగా హేమంత్, కార్తిక్, మేఘన, లహరి, శివ, శివబాలాజీ, తేజ, మధు, మౌళి, సాయి ఎన్నికయ్యారు.

నూతనంగా ఎన్నికైన ఎస్ఎఫ్ఐ కార్యవర్గం

సంపద తయారీ కేంద్రం ద్వారా రూ.4,400 ఆదాయం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు గ్రామపంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. దీని ద్వారా బుధవారం గ్రామ పంచాయతీకి రూ.4400 ఆదాయం సమకూరినట్టు ఇఒపిఆర్‌డి ఆర్.శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈ ఆదాయాన్ని పంచాయతీ నిధులకు జమ చేసినట్టు తెలిపారు. ఈ వేస్ట్ మెటీరియల్ అమ్మకం ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయాన్ని తీసుకు రావడంలో కృషి చేసిన చాగల్లు పంచాయతీ కార్యదర్శి ఎండి.మెహబూబ్ అలీ ఇతర గ్రేడ్-5 కార్యదర్శులు, శానిటేషన్ సూపర్‌వైజర్లు, శానిటేషన్ సిబ్బందిని అభినందించారు.

గోపాలపురంలో డెంగీ కలకలం

పది రోజుల వ్యవధిలో మూడు కేసులు

ప్రజాశక్తి-గోపాలపురం

గోపాలపురంలో డెంగీ కలకలం రేగింది. పది రోజుల వ్యవధిలో ఒకే ప్రాంతంలో మూడు కేసులు నమోదు కావడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఉప్పరగూడెంకు చెందిన వీరంకి సుజాత తీవ్రంగా జ్వరం రావడంతో స్థానిక ల్యాబ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు తేలింది. దీంతో హుటాహుటిన రాజమండ్రిలో ప్రైవేట్ ఆసుపత్రిలో ఐసియులో చేర్చారు. 6 రోజులకు సుమారు రూ.80,000 వరకు ఆసుపత్రికి, ఖర్చులకు చెల్లించినట్టు తెలిపారు. తండ్రి నాగేశ్వరరావు వ్యవసాయ కూలీ డబ్బులు చెల్లిస్తేనే డిశ్చార్జ్ చేశారని దీంతో తీవ్ర అవస్థలు పడినట్లు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన వేముల జగదీశ్వరికి తీవ్రంగా జ్వరం రావడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ అని తేలింది. దీంతో ఈ నెల 1న రాజమండ్రిలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. సుమారు ఐదు రోజులు ఆస్పత్రిలో చికిత్సకు రూ.70,000 వరకు ఖర్చు చేసినట్టు తెలిపారు. డబ్బులు చెల్లిస్తేనే గాని డిశ్చార్జ్ చేయమని వైద్యులు తెలపడంతో భర్త వేముల శ్రీను అప్పుచేసి డబ్బులు చెల్లించినట్టు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన ఐదేళ్ల బాలుడు నూతంగి జోసఫ్‌కు సుమారు పది రోజుల నుంచి జ్వరం రావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో నాలుగు రోజులు పాటు వైద్యం అందించారు. అయినప్పటికీ తగ్గకపోవడంతో రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

మండలంలో డెంగ్యూ జ్వరాలకు పారిశుధ్య లోపమే కారణమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామ వీధుల్లో ఎటు చూసినా చెత్తాచెదారం, మురుగునీరు దర్శనం ఇస్తున్నాయని, కాలువల్లో పూడికలు తీయకపోవడంతో, మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

అన్నపూర్ణమ్మపేట అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంత్రి సంబరాలు

అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోగల అన్నపూర్ణమ్మ పేట సెక్టర్ సెమెట్రీ పేట-2 అంగన్ వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి ముగ్గులు, భోగి మంటలు, ప్రీస్కూల్ పిల్లలకు భోగి పండ్లు వేశారు. ఈ కార్య్ర కమానికి ప్రాజెక్ట్ అధికారి సిహెచ్‌వి.నరసమ్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లులకు, పిల్లలకు సెంటర్లపై విశ్వాసం పెరుగుతుందన్నారు. పిల్లల్లో ఉన్న నైపుణ్యతను కూడా వెలికితీయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరలక్ష్మి, సిమ్మెంట్రీ పేట ఎలిమెంటరీ స్కూల్ హెచ్ఎం స్వరూప రాణి, అంగన్‌వాడీ కార్యకర్త శైలజ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-కడియం

సంక్రాంతి సందర్భంగా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కడియం సిఐ అల్లు వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బుధవారం కడియంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని ప్రజలంతా సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా సంస్కృతి, సంప్రదాయబద్ధంగా ఆహ్లాదకరమైన వాతావణంలో జరుపు కోవాలని కోరారు. కోడిపందేలు, పేకాట, గుండాట వంటి ఆటలు ఆడినా, నిర్వహించినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో కోడి పందేలు, పేకాట ఆడిన, నిర్వహించిన వారిని గుర్తించి ఇప్పటివరకూ సుమారు 75 మందిని తహశీల్దారు ముందు బైండోవర్ చేశామని తెలిపారు. 80 కోడి కత్తులు స్వాధీన పరచుకున్నట్లు ఆయన తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడానికి ఉపయోగించిన స్థల యజమానులపై సైతం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-చాగల్లు

చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం సబ్ స్టేషన్ పరిధిలో గురువారం, శుక్రవారం 11 కెవి.బ్రాహ్మణగూడెం, 11 కెవి ధారవరం, ఫీడర్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్టు విద్యుత్ శాఖ అధికారి ఎస్.త్రిమూర్తులు తెలిపారు. దీని వల్ల బ్రాహ్మణగూడెం, ధారవరం గ్రామాలకు, లిఫ్ట్ ఇరిగేషన్ ఫీడర్లకు, నిడదవోలు ఫిష్ టాంక్స్‌కు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనంపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కడియం, పెరవలి

సమగ్ర శిక్ష, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలుపై కడియం ఉన్నత పాఠశాలలో రెండు రోజులు సామాజిక తనిఖీ నిర్వహించారు. మిడ్ డే మీల్స్ అమలు, బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగిజావ రికార్డ్సను తనిఖీ చేశారు. ఆర్ఒ ప్లాంట్, తరగతి గదులు, టాయిలెట్స్ శుభ్రత అంశాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ డిఆర్పిలు రేపు నాగేశ్వరరావు, కొమ్మర సూర్యప్రకాష్ ఆరో ప్లాంట్‌ను మెరుగు పరచాలని, విద్యార్థులకు శనివారం మెనూ మార్చమని సూచించారు. రెండో రోజైన బుధవారం పేరెంట్స్ మీటింగ్, చదువుపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం టి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బి.సువర్ణవేణి, డేవిడ్, వీరబాబు పాల్గొన్నారు.

పెరవలి మండలంలోని కానూరులోని శ్రీఅక్కిన చంద్రయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు రోజుపాటు సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. దీనిలో భాగంగా రాష్ట్ర కమిటీ పాఠశాలను సందర్శించి అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకము, మరుగు దొడ్లు, పిల్లల నడవడి, కిచెన్ గార్డెన్, ఉపాధ్యాయుల నడవడి, పాఠశాల నిధులు మొదలగు విషయాలపై తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్ఎం షేక్ సున్నీసా, సర్పంచ్ భావన మధు పూర్ణ చందు, ఉప సర్పంచ్ అనపర్తి నరసింహమూర్తి కమిటీ వైస్ చైర్మన్ నరమామిడి ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడియంలో తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిఆర్‌సి

ఎరువులు, పురుగు మందుల నాణత్య పరిశీలన

ప్రజాశక్తి - కోరుకొండ

మండల కేంద్రమైన కోరుకొండలోని ఎరువుల దుకాణాలలో పురుగు మందుల నాణ్యతలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి కాకి మాధవరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు ఎరువుల దుకాణాలలో పురుగు మందుల శాంపిల్స్‌ను పరీక్షా కేంద్రానికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుత రబీ సీజన్‌లో నారుమళ్లు నాటుకుని, నాట్లు వేస్తే మార్చిలోగా పూర్తిస్థాయిలో కోతకు వచ్చి మంచి దిగుబడి ఆస్కారం ఉంటుందన్నారు. నాట్లు ఆలస్యమయితే అధికవేడితో గింజ ఇరిగిపోయి దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు ఒక పంట వరి, రెండో పంట కింద మొక్కజొన్న, సజ్జ, రాగులు, అపరాలు, కూరగాయలు వంటివి పండిస్తే, దినసరి ఆదాయం పెరగడంతో పాటు వరికి అధిక రేటు లభిస్తుందన్నారు. రైతులు తక్కువ ధరకు లభించే యూరియాను ఎక్కువ మోతాదులో వాడుతున్నారని, యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు నత్రజని, డిఎపి, పొటాస్ వాడితే మంచి దిగుబడితో పాటు నేల సారవంతంగా ఉంటుందన్నారు. రైతులు వరినాట్ల సమయంలో ఒక ఎకరాకు 25 కేజీల యూరియా, 50 కేజీల డిఎపి, 15 కేజీల పొటాస్ వాడితే పంట ఆరోగ్యంగా ఉండి దిగుబడి ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులు తమ పొలాల్లో పశువుల పెంటతో పాటు సేంద్రియ ఎరువులు వాడితే పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మల్లికార్జునరావు, ఎఒ గౌరీ దేవి తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

ప్రజాశక్తి - జగ్గంపేట

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంతో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల్లో 18 మందిని మద్యం తాగి వాహనం నడుపుతుండగా వారిని అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టామని వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 13 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు. మరో ఐదుగురుకి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రావులపాలెం

మండల పరిధి కొమరాజులంక బస్టాండ్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ప్రకారం అమలాపురం నుంచి రావులపాలెం వచ్చే రహదారి వెంబడి నున్న కొమరాజులంక బస్టాండ్‌లో సుమారు (35) సంవత్సరాల వయస్సు గల పురుషుని మృతదేహం ఉన్నట్లు స్థానిక వీఆర్ఓ ఫిర్యాదు చేయడంతో స్థానిక పోలీసుస్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతిని వివరాలు తెలిసిన వారు ఎస్‌హెచ్‌ఒ, ఎస్ఐకి సమాచారం అందించాలని పోలీసు తెలిపారు.

పేకాట శిబిరాలపై దాడులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో బుధవారం ఎస్ఐ ఎస్. రాము తన సిబ్బందితో పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. రాజవరం గ్రామ శివారు పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,210 స్వాధీనం చేసుకున్న కేసు నమోదు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు..

160 కోడి కత్తుల స్వాధీనం

ప్రజాశక్తి - పెరవలి

రానున్న సంక్రాంతిని పురస్కరించుకుని నిర్వహించిన దాడుల్లో 160 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్‌పి డి.శ్రీహరిరాజు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న కత్తులతోపాటు, సంబంధిత వ్యక్తిని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండుగ పర్వదినాలను ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవాలని ఆయన సూచించారు. కోడిపందాలు, జూదాలు నిర్వహించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐ పి.సూరిఅప్పారావు, ఎస్ఐ ఎస్.రామలింగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిపై కేసు నమోదు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కత్తితో హల్‌చల్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన విద్యార్థిపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...మండలంలోని చెందుర్తి గ్రామానికి చెందిన ఒక విద్యార్థి గొల్లప్రోలు జడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన మరో బాలిక పిఠాపురం కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఆ విద్యార్థినిపై విద్యార్థి తప్పుడుగా ప్రచారం చేస్తున్నాడు. బుధవారం ఇదే అంశాన్ని కళాశాల సమీపంలో తనపై ఎందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నావని నిలదీసింది. దీంతో ఆ విద్యార్థి ఆమెపై దాడి చేశాడు. దాడిని అడ్డుకోబోయిన వారిని చంపేస్తానని, కత్తి తీసి భయభ్రాంతులకు గురిచేశాడు. స్థానికులు అధిక సంఖ్యలో సంఘటన ప్రాంతానికి చేరుకోవడంతో ఆ విద్యార్థి అక్కడ నుంచి పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పారిపోయిన విద్యార్థి వదిలేసిన బ్యాగ్, వ్యాగస్ స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని కాండ్రకోటలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊట ను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాద్‌రావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పిడిఎస్ బియ్యం సీజ్ పలువురిపై కేసులు నమోదు

ప్రజాశక్తి - గోపాలపురం

రైస్ మిల్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ రైస్‌ను సీజ్ చేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. కోమటికుంటలోని మాతంగి మాత ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ రైస్ మిల్లులో 44 బస్తాల పిడిఎస్ బియ్యం, రైస్ మిల్లు ఆవరణలో ఉన్న లారీలో 580 పిడిఎస్ బియ్యం బస్తాలను గుర్తించినట్లు తెలిపారు. వీటి విలువ రూ.14,31,111గా అంచనా వేసినట్లు తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై మిల్లు యజమానులు, లారీ యజమాని, లారీ డ్రైవర్‌పై గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంధుల పాఠశాలకు చేయూత

ప్రజాశక్తి - ఆలమూరు

అంధుల పాఠశాల విద్యార్థులకు సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు విరాళాలు అందించారు. మండల కేంద్రం లోని శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు, రావులపాలెంలోని శ్రీ సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు కలసి విజయవాడ చెందిన అంధుల పాఠశాలకు మానవతా సహాయంగా విరాళాలను సేకరించారు. స్కూల్ అధినేత సిద్ధార్థ సంస్థల అధినేత కె.ముల్లారావు చేతుల మీద విద్యార్థులు సేకరించిన విరాళాలు రూ.6,70,197 బుధవారం అందజేశారు. ఇందులో ఆలమూరు సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు రూ.2,43,531, రావులపాలెం సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు రూ.4,26,666 విరాళాలు సేకరించారన్నారు.

వరదలు, ప్రకృతి విపత్తుల నిర్వహణపై నివేదిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

అమరావతి నుంచి బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టీజీ 27పై, సిసిఎల్ఎ కమిషనర్ రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జెసి ఎస్.చిన్నరాముడు, డిఆర్ఓ టి.సీతారామమూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ, జూలై నెలలో సంభవించిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిహారం ఎన్యూమరేషన్ చేసినట్లు తెలిపారు. సెప్టెంబర్ నెలలో విజయవాడ వరద సమయంలో పునరావాస కార్యక్రమంలో భాగంగా ఆహారం, ఇతరాలను తూర్పు గోదావరి జిల్లా నుంచి పంపినట్లు తెలిపారు. హార్టికల్చర్ పంట పరిహారాన్ని అందజేసినట్లు తెలిపారు. ఎర్ర కాలువ పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారుల ద్వారా సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేసి చేపట్టవలసిన పనులపై ఇవసిసికి ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు. సిసిఎల్ఎ కమిషనర్ జి.జయలక్ష్మి రీ సర్వే, సభల నిర్వహణ, అర్జీలు పరిష్కార స్థాయిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎఓ ఎఓ.ఆలీ, డిప్యూటీ తహశీల్దారు శాస్త్రి పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలి

ప్రజాశక్తి - బిక్కవోలు

గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్, వైస్ చైర్మన్‌గా ఎంపికైన వారు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పని చేయాలని ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం బలభద్రపురంలో ఎంఎస్‌ఆర్ కల్యాణ మండపంలో గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్ఎ రామకృష్ణారెడ్డి మాట్లాడారు. పదవులు శాశ్వతం కాదని, పదవిలో ఉన్నపుడు మనం చేసే మంచి పనులే ప్రజల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని ఎంఎల్ఎ తెలిపారు. అనంతరం ఆయన ప్రాజెక్ట్ చైర్మన్ ముదారెడ్డి సునీల్ కుమార్, వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డిని, డిసి డైరెక్టర్‌లను, నీటి సంఘం అధ్యక్షులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డిసి చైర్మన్లు,

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ నల్లమిల్లి

వివిధ నీటి సంఘాల అధ్యక్షులు, తెలుగు మహిళలు, అనపర్తి నియోజకవర్గం ఎన్‌డిఎ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎడిబి రహదారిలో పనుల పరిశీలన

ప్రజాశక్తి - రాజానగరం

కాకినాడ-రాజానగరం ప్రధాన రహదారి మార్గంలో ఎపి రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధులతో చేపట్టిన కాకినాడ-రాజానగరం ప్రధాన రహదారి పనులు సమగ్రవంతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. రాజానగరం, రంగంపేట మండలాల పరిధిలో ఎడిబి రహదారి పనులను, భూసేకరణ పరిస్థితి అంచనా వేసేందుకు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడుతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో ఎస్‌టి రాజుపురం, వడిశలేరు గ్రామాల్లో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలకు గురైన వాటిని గుర్తించి, అక్కడ నుంచి వారిని తరలించి, ఆయా నిర్మాణాలు తొలగించే విషయంలో హేతుబద్ధతతో వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. తర్వాత జాయింట్ కలెక్టర్

ప్రధాన రహదారి పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఎస్.చిన్నరాముడు రంగంపేట, పెదరాయవరం తదితర గ్రామాలకు చెందిన ప్రాంతాల్లో రహదారి మార్గాన్ని పరిశీలించారు. వీరి వెంట ఆర్‌డిఓ ఆర్.కృష్ణ నాయక్, ఆర్‌డిసి ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీకాంత్, తహశీల్దార్లు లావణ్య, కె.అనసూయ తదితరులు ఉన్నారు.

రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుగా గుడ్డిగూడెం

ప్రజాశక్తి - గోపాలపురం

ఎపి ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రాజెక్ట్‌లో భాగంగా మండలంలో గుడ్డిగూడెం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు తహశీల్దారు కె.అజయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వేలో భాగంగా గుడ్డిగూడెంలో జనవరి 20 నుంచి భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని రైతులందరూ భూములకు సంబంధించిన వివరాలను, భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్, పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కు సంబంధించిన జిరాక్స్ కాపీలు, రైతు ఫోన్ నెంబర్ వివరాలతో పాటు చనిపోయిన భూ యజమానుల వారసులు వారి పేరుపై భూమిని మార్చుకోవడానికి సంబంధిత డాక్యుమెంట్స్‌ను వీఆర్‌ఓకు అందజేయాలన్నారు. భూముల రీ సర్వే సమయంలో గుడ్డిగూడెంలో రైతులు అందరూ వారికి ఇచ్చిన నోటీసు ప్రకారం రీసర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని రైతులను కోరారు.

జనసేన కార్యకర్తలకు బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రమాదవశాత్తు గాయపడిన పలువురు జనసేన కార్యకర్తలకు చెక్కులు పంపిణీ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక టిటిఆర్ కల్యాణ మండపం లో బుధవారం గోదశి పుండరీష్ అధ్యక్షతన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బందారు శ్రీనివాస్ చేతులు మీదుగా నగర పంచాయతీకి చెందిన ఆకుల కరణ, ఐ.పోలవరం మండలం పాత ఇంజరం గ్రామానికి చెందిన రాచకొండ పుల్లయ్య నాయుడుకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కడలి ఈశ్వరి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కర్రా దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు దూడల స్వామి,మద్దింశెట్టి పురుషోత్తం, ముత్యాల జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో నేతాజీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ఇటీవల కడియంలో ఎస్ఆర్ఎ కళాశాల్లో ఆధ్వర్యంలో నిర్వహించిన బైజిస్ టాలెంట్ టెస్ట్‌లో పదవ తరగతి నందు మండలంలోని చెముడులంక నేతాజీ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ తమ్మా శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. బహుమానించింది కళాశాల చెందిన సింగవరపు దుర్గ లక్ష్మీ ప్రథమ స్థానం, మడికి చెందిన దూలం భావనలు ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. ఎంపిసి టాలెంట్ టెస్ట్‌లో బడుగువానిలంకకు చెందిన పదో తరగతి నేతాజీ స్కూల్ విద్యార్థి నేతల అఖిల్ ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ఆలమూరు, కడియం మండలాల పరిధిలో 300 మంది 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను మాజీ ఎంపిటిసి

విజేతలను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాసరావు

సభ్యుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి వెంకటరత్నం తదితరులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నార్ కాలేజ్ ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - యంత్రాంగం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

కె.గంగవరం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందాలు, అశ్లీల నృత్యాలు, పేకాట, గుండాట, వంటి జూద క్రీడలు తదితర అసాంఘిక కార్యక్రమాలు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కె.గంగవరం ఎస్ఐ జానీబాషా హెచ్చరించారు. ఆయనా బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే జాతరలకు సంబంధించి కమిటీ సభ్యులు అగ్రిమెంట్ పోలీసులు తీసుకొని చర్యలు తీసుకోవాలన్నారు. జాతరల సందర్భంగా కమిటీ మెంబర్లు తప్పనిసరిగా నోటరీ చేయించుకోవాలని, జాతర కార్యక్రమాలలో సౌండ్ బాక్సులను ఏర్పాటు చేసిన తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండలంలో జూద క్రీడలలో పాల్గొనేవారిని 66 మందిని గుర్తించామన్నారు. ఇప్పటివరకు 30 మందిపై బైండోవర్‌లు నమోదు చేశామన్నారు. జూద క్రీడలలో పాల్గొని యువత వారి భవిష్యత్తును నాశనం చేసుకోకూడదన్నారు. గ్రామాలలో పెద్దల సహకారంతో సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఇంకనూ కొన్ని గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. ఈ విధంగా మండలం మొత్తం సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కాట్రేనికోన: చెయ్యేరు, గెద్దనపల్లి, పల్లం, బలుసు తిప్ప గ్రామంలో గ్రామస్థుల ఒడిదొడి రాబోయే సంక్రాంతి సందర్భంగా ఎస్ఐ ఎ.అవినాష్ జూద క్రీడలపై బుధవారం గ్రామసభ సమావేశం నిర్వహించారు. గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలు సంక్రాంతి పండుగను ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను తావు ఇవ్వకుండా సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కోడిపందాలు, పేకాట, గుండాట ఆడటం నిర్వహించడం పాల్గొనడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. గతంలో కోడి పందేలు ఆడిన వారిని, వాటిని నిర్వహించిన వారిని ఇప్పటి వరకు కాట్రేనికోన పోలీస్ స్టేషన్ పరిధిలో పలువురుపై కేసులు బైండ్ ఓవర్ చేసి వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచినట్లు చెప్పారు.ఇంకా మిగిలిన వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. మండలం లోని రైతులు మరి ఇతర భూ యజమానులు వారి స్థలాలలో కోడిపందేలు, గుండాట, పేకాట, అశ్లీల నృత్యాలు వంటి మరే ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన టకు అనుమతించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

ఎస్‌టియు కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎస్‌టియు మండల శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. శాఖ నూతన అధ్యక్షురాలిగా జె.సునీత, ప్రధాన కార్యదర్శిగా ఇ.సత్యనారాయణ, కోశాధికారిగా సిహెచ్.మహేష్, జిల్లా కౌన్సిలర్‌గా జి.రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా ఎస్ఎల్ కాత్యాయని, సహాయ కార్యదర్శిగా కె.రేవతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డాక్టరేట్ అందుకున్న అధ్యాపకురాలు మేరుగు శాంతకుమారి

శాంతకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని ప్రభుత్వ ఆటానమస్ ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకురాలు మేరుగు శాంత కుమారికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. సింథసిస్ అండ్ బయాలజికల్ ఆక్టివిటీస్ ఆఫ్ సబ్‌స్టిట్యూటెడ్ 1,4-డై హైడ్రో పిరిడిన్స్, సైనోఎక్రిలేట్స్, అండ్ ఫ్యూజ్డ్ పిరిమిడిన్ డెరివేటివ్స్' అనే అంశంపై పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. ఈ పరిశోధనలో ఉపిరితిత్తులు, కాలేయంకు సంబంధించిన కాన్సర్ నిరోధక ఔషధాలపై పరిశోధన చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, ఐక్యూఎసి కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.అన్నపూర్ణ, ఎకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.రాజేశ్వరి అభినందించారు.

ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న తహశీల్దారు

గాదెలపాలెంలో ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గాదెలపాలెంలో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల స్థలాలను తహశీల్దారు సత్యప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరుగుతున్న ప్రక్రియలో భాగంగా ఇదే సమస్యపై స్థానిక రెవెన్యూ సదస్సులో ఇళ్ల స్థలాల కోసం అర్జీలు అధిక సంఖ్యలో రావడంతో స్థానిక టిడిపి నాయకులు భూపతిపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ గణ్ రామ ఆధ్వర్యంలో ఈ ఇళ్ల స్థలాన్ని పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కమ్మిల అచ్చిబాబు, మండల సర్వేయర్ శివ, ఆర్ఐ వల్లి, విఆర్ఓ రాజకుమార్, గునిపే ఏడుకొండలు, దేవిరె పాల్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీలో చాగల్లు జట్టు విజయం

ప్రజాశక్తి - చాగల్లు

ఎన్‌టిఆర్ ప్రీమియం క్రికెట్ టోర్నమెంట్‌లో చాగల్లు టీము విజయం సాధించింది. బుధవారం చాగల్లు నిడదవోలు జట్టు పోటీ పడగా చాగల్లు టీమ్ విజయం సాధించింది. టిడిపి సీనియర్ నాయకులు కోడూరి ప్రసాద్, నాదెండ్ల శ్రీరామ చౌదరి, జగతా వీరభద్రరావు, కరటూరి సతీష్, కొటారు అశోక్ బాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్త్రీ శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు కిశోరి వికాసం ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిడిఓ వివిఐఎన్.రామారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, బాలికలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా అందరూ కలిసి పని చేయాలని సూచించారు. ఇందుకోసం మండల స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

మత్స్యకారుల వివాదాన్ని పరిష్కరించాలి

ప్రజాశక్తి - అమలాపురం

ధవళేశ్వరం కాటన్ బ్యారే జ్ వద్ద బొబ్బర్లంక మత్స్యకార సంఘం, ధవళేశ్వరం మత్స్యకార సంఘాల మధ్య నెలకొన్న వివాదంపై నది సంరక్షణ కోసమే, తూర్పుగోదావరి మత్స్యశాఖ అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జేసి టి.నిషాంతి ఆదేశించారు. బుధవారం మత్స్య శాఖ అధికారులు నదీ సంరక్షణ అధికారులు, పోలీసు అధికారులు మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి రొయ్య పిల్లల సేకరణ సరిహద్దు వివాదానికి గల పూర్వాపరాలపై సమీక్షించారు. కార్యక్రమంలో నదీ సంరక్షణ అధికారి ఆర్.కాశీ విశ్వేశ్వర రావు, తూర్పుగోదావరి జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు పాల్గొన్నారు.

పలువురికి సూర్యనారాయణ రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - బిక్కవోలు

ఇటీవల అనారోగ్యంతో మరణించిన బలభద్రపురం గ్రామానికి చెందిన దుండ పాపాయమ్మ, గొర్రు గోవింద కుటుంబ సభ్యులను మాజీ ఎంఎల్ఎ సత్తి సూర్యనారాయణ రెడ్డి బుధవారం పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మండ దుర్గారెడ్డి, గొల్లపూడి లక్ష్మిని పరామర్శించారు. ఆయన వెంట పోతుల ప్రసాద్ రెడ్డి, కొప్పురు వెంకటరామారెడ్డి, ఎస్.వీరరాఘవరెడ్డి వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల కరపత్రం పంపిణీ

ప్రజాశక్తి - దేవరపల్లి

మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను పదో సంక్రాంతి సంబరాలను జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. కొత్తపల్లి తాతారావు కోరారు. బుధవారం సంక్రాంతి సంబరాలు కరపత్రాన్ని స్థానిక త్యాజంపూడి హైస్కూల్ ఆవరణలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.శ్రీనివాసరావు, డివైఎఫ్ఐ నాయకులు సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, సకినాల ఉపేంద్ర, బండి నాని తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థికి తృతీయ స్థానం

ప్రజాశక్తి - సీతానగరం

సత్యసాయి సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'ఇచ్ఛట క్షమించుట' అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఆర్ క్రాంతి తృతీయ స్థానం సాధించారు. సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో సత్యసాయి సంస్థల తరఫున సాయిబాబా హాజరై మాట్లాడారు. ప్రతిభ ఆధారంగా సత్యసాయి విద్యాలయం పుట్టపర్తిలో ఎల్‌కెజి నుంచి ఇంటర్ వరకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దొరబాబు మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థి ఉత్తమ ప్రతిభ చూపడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు చెల్లారావు, నరసింహం, వెంకటరమణ, సురేష్, పాండురంగ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న పుదుచ్చేరి గవర్నర్ కైలాసనాథన్

అన్ని రంగాల్లో పుదుచ్చేరి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలోని నాలుగు రీజియన్లు యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి ప్రాంతాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందని లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాసనాథన్ అన్నారు. యానాం ప్రజా ఉత్సవాల ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానాం ప్రజా ఉత్సవాలు, పలువురు ప్రముఖుల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం యానాంలో కన్పిస్తుందన్నారు. పుదుచ్చేరిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సివుందని, అధికారులు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను 1965లో చెన్నైలో చదువుకుంటున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమహేంద్రవరం, కాకినాడ, గుంటూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు చెందిన తెలుగు మిత్రులు ఉండేవారని గుర్తు చేసుకున్నారు. గోదావరి, బేఆఫ్ బెంగాల్ ప్రదేశం ఆర్థికాభివృద్ధికి ఉపకరిస్తుందన్నారు. ప్రధానమైన సమస్యలను గవర్నర్ దృష్టికి ఎంఎల్ఎ అశోక్ తీసుకెళ్లారు. నియోజకవర్గ పరిధిలో ప్రధానమైన వైద్య, ఆరోగ్యపరమైన మౌలికసదుపాయాల కల్పన, ఆయుష్మాన్‌భారత్ పథకాన్ని యానాంలో అమలు చేయాలని కోరారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ఆరటికాయలంక నుంచి కనకాలపేట మీదుగా జెండాస్తంభం వరకు నేషనల్ హైవేస్ సంస్థచే రహదారి విస్తరణ, సిఎస్‌ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులు, పలు శాఖల్లో ఎస్ఎంఎలుగా ఉన్నవారిని పర్మినెంట్ చేయాలని కోరారు. యానాం ప్రజా ఉత్సవాలను గత కొన్నేళ్లుగా బాలయోగి స్టేడియంలో ప్రజాశికాబద్ధంగా ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒఎన్‌జిసి పరిహారం అంతా లబ్ధిదారులకు సక్రమంగానే అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి మునిస్వామి, మంత్రి కె. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్న విజేతలు

బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బుధవారం బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. యువకులకు వాలీ బాల్, కబడ్డీ, రన్నింగ్, స్కిప్పింగ్ ఆటల పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించేందుకని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు, ప్రశంస పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.ముత్యాలు, కొప్పనాతి రమేష్, చంద్రశేఖర్, వద్ది వరప్రసాద్ పాల్గొన్నారు.

యాజమాన్యానికి నోటీసులు అందిస్తున్న సిబ్బంది

అంగన్ ఫుడ్స్ లిమిటెడ్ పరిశ్రమకు నోటీసులు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం గ్రామ శివారులోని అంగన్ ఫుడ్స్ లిమిటెడ్ పరిశ్రమకు బుధవారం రెవెన్యూ, పంచాయతీ అధికారులు నోటీసులు అందించారు. 2023-24 వ సంవత్సరపు జమ ఖర్చుల వివరాలు, ఆస్తులు అప్పుల వివరాలు, ఉద్యోగుల వివరాలు, కరెంట్ బిల్లుల వివరాలు అందించాలని యాజమాన్యానికి అందించినట్లు ఎస్ఓ జోడాల వెంకట్ తెలిపారు. ప్రతి సంవత్సరం జిల్లాలోని కొన్ని పరిశ్రమలను ఎంపిక చేసి వాటి డేటా ఆధారంగా జిల్లా, రాష్ట్ర స్థాయి ఆదాయ అంచనాలు వేస్తామన్నారు. కావున పరిశ్రమల యజమానులు సరైన డేటాను అందించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇఒ వంకా అనురాధ, విఆర్ఓ లక్ష్మి, జూనియర్ సహాయకులు కబీర్ పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

F.D.I.A.No.4/2023 in O.S.488/2022

Between:

సంగినేడి నరేష్‌బాబు ...వాది

Vs

1.కొంజెర్ల బాలాజీ

2.కొంజెర్ల రమేష్

3.సరమానికి నాగలక్ష్మి ...ప్రతివాదులు

పై నంబరు ఫైనల్ డిక్రీ పిటీషను వాది తనఖా బాకీ డిక్రీ అయినందున దాఖలు చెయ్యగా శ్రీకోర్టు వారు తనఖా ఆస్తిని వేలం వేయుటకు గాను ది.29-1-25నకు వాయిదా వేసినారు. కావున వేలంలో పాల్గొనుటకు ఆసక్తి కల వారు ది.29-1-25న ఉదయం 10.30 గంటలకు పైకోర్టులో హాజరయి తనఖా ఆస్తిని వేలంలో పొందవచ్చును. కావున తెలియచెయ్యడమైనది.

తనఖా ఆస్తి వివరం

ప.గో.జిల్లా ప్రస్తుతం తూ.గో.జిల్లా, నల్లజర్ల మండలం, అనంతపల్లి సబ్ డివిజన్ తెలికచర్ల గ్రామం, ఆర్.ఎస్.నెం.286 నందు 210 చ.గ.స్థలంలో పడమర వైపు గల 105 చ.గ.స్థలంనకు హద్దులు :

తూ : కొంజెర్ల రమేష్ గారి స్థలం మరియు ఇల్లు.

ద : మడికిర్ల మాధవరావు గారి స్థలం మరియు ఇల్లు.

ప : కనక జోగయ్య గారి భూమి.

ఉ : కొంజెర్ల సాయి బాబా గారి స్థలం.

పై ఆస్తికి గల యాజమెంటు హక్కులతో సహా.

G.K.Durga Devi
Advocate, Tadepalligudem.
Cell: 9985592776.